రొయ్య రైతు దిగాలు

- వాతావరణ ప్రభావంతో ఎదుగుదల లేని రొయ్యలు
- పెరుగుతున్న పెట్టుబడులు



రొయ్యల గుంతల్లో ఆక్సిజన్ పెంచేందుకు వినియోగిస్తున్న ఏయిరేటర్లు

బిట్రగుంట: తీరంలో వెనామీ సాగు చేస్తున్న ఆక్వా రైతులపై ప్రకృతి పగబట్టింది. చల్లని వాతావరణంతో గుంతల్లో దిగుబడి పెరగాల్సిన సమయంలో ఊహించని విధంగా ఎండలు పెరిగిపోవడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా రొయ్యల ఎదుగుదల తక్కువగా ఉంటుంది. గుంతల్లో నీరు తొందరగా ఆవిరవుతుండడంతో ప్రతిరోజూ గుంతల్లో నీరు కూడా పంపింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే రొయ్య పిల్లలు కూడా ఒత్తిడికి గురై ఎదుగుదల అంతంత మాత్రంగా ఉంటుంది. జూన్ రెండో వారం నుంచి వాతావరణం చల్లబడి తొలకరి జల్లులు, గాలులతో రొయ్యల్లో మౌల్టింగ్ ప్రక్రియ చురుగ్గా జరిగి (గుల్ల విడవడం) త్వరగా ఎదుగుతాయి. అయితే జూన్ నెల పూర్తవుతున్నా ఎండలు తగ్గకపోవడంతో రొయ్యల్లో మౌల్టింగ్ ప్రక్రియ జరగడం లేదు. గుంతల్లో నీరు తగ్గిపోతుండడం, ఆక్సిజన్ శాతం కూడా పడిపోతుండడంతో రొయ్యలు గుంతల్లో పైకి తేలుతున్నాయి. మధ్యాహ్నం సమయంలో విపరీతమైన ఉక్కపోత ఉంటుండడంతో ఆక్వా గుంతల్లో ఆక్సిజన్ సమస్య తలెత్తుతోంది. నీటిలో ప్రాణవాయువు (డిసాల్వ్‌డ్ ఆక్సిజన్) తగ్గిపోయి రొయ్యలు నీటిపైకి తేలుతున్నాయి. కావలి, అల్లూరు, బోగోలు మండలాల్లో సుమారు 8 వేల ఎకరాలకు పైచిలుకు వెనామీ సాగు చేస్తుండగా డీఓ సమస్య కారణంగా రైతులు అల్లాడిపోతున్నారు. పగలంతా ఎండ, సాయంత్రం ఉక్కపోత ఏర్పడుతుండడంతో రొయ్యలు ఆక్సిజన్ కోసం నీటిపైకి వచ్చేస్తున్నాయి. రొయ్యలు నీటిపైకి తేలిన సమయంలో ఎండ తీవ్రత కారణంగా వ్యాధులకు గురవుతున్నాయి. మరోవైపు ఆక్సిజన్ లోపం కారణంగా రొయ్యలు నీరసించి మేత కూడా సరిగా తీసుకోవడం లేదని, మౌల్టింగ్ ఆగిపోయి ఎదుగుదల నిలిచిపోతోందని రైతులు వాపోతున్నారు. గుంతల్లో పిల్లలు వదిలి 90 రోజులు దాటుతున్నా మౌల్టింగ్ జరగని కారణంగా 70 కౌంట్ దాటడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా 90 రోజులకు 50–40 కౌంట్ రావాల్సిన రొయ్యలు 70 కౌంట్ దాటకపోవడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

క్లుప్తంగా

మొక్కలు నాటిన విద్యార్థులు



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు ఉర్దూ ఎంపీపీ పాఠశాలలో శనివారం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయుడు జావేద్ మొహిది మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.

కందకాలు ఏర్పాటు



కందకం తవ్వుతున్న జేసీబీ

సంగం: మండలంలోని వెంగారెడ్డిపాళెం గ్రామంలో ఇసుక అక్రమ తవ్వకాలపై అధికారులు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ రమాదేవి ఆదేశాల మేరకు ఇసుక వాహనాలు రాకపోకలు అడ్డుకునేలా వీఆర్‌ఓ శోభన్‌బాబు కందకాలను తవ్వించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలకు బీరువా వితరణ



ఆత్మకూరురూరల్: మండలంలోని బండారుపల్లి ఎంపీయూపీ పాఠశాలకు పూర్వ విద్యార్థులు రూ.12 వేల విలువ చేసే బీరువాను శనివారం వితరణగా అందజేశారని ప్రధానోపాధ్యాయుడు పాదలకూరు పెంచలయ్య తెలిపారు. గడ్డం శ్రీనివాసులు, రెడ్డిబత్తిన పెంచలప్రసాద్, గడ్డం ప్రసాద్, కరణం ప్రతాప్ బీరువాను బహూకరించిన వారిలో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు చంద్రమోహన్‌రెడ్డి, రామిరెడ్డి, రామసుబ్బారెడ్డి, మధుసూదన్ తదితరులు అభినందించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



ఆత్మకూరురూరల్: మండలంలోని వాశిలిలో శనివారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహించారు. వర్షాకాలంలో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ చెలిక రమాహరిబాబు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేశామని, తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. మెరుగైన సేవలు అందించేందుకు గ్రామస్తులు పంచాయతీ పాలకవర్గానికి సహకరించాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సీతారామపురం : వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ వైద్య సిబ్బంది అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి సీతారామపురం మండలంలోని సంజీవరెడ్డినగర్ గ్రామంలో శనివారం అవగాహన కల్పించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలంతా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. తాగునీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని సూచించారు. అనంతరం గ్రామంలో క్లోరినేషన్ చర్యలు చేపట్టి కుళాయిలు, చేతిపంపుల వద్ద నీటి నమూనాలను సేకరించి పరీక్షించారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆపన్నహస్తం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇటీవల నగరంలోని బర్మాషెల్‌గుంట ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్యూర్‌స్మైల్ సేవా సంస్థ చేయూతనందించింది. సంస్థ నిర్వాహకురాలు పర్వీన్ ఆధ్వర్యంలో బాధితులకు వంటపాత్రలు, బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులను శనివారం అందజేశారు. సంస్థ సభ్యులు నళిని, స్వర్ణ, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



అజెండాలోని అంశాలను వివరిస్తున్న కమిషనర్ ఫజులుల్లా

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో కమిషనర్ షేక్ ఫజులుల్లా శనివారం నిర్వహించారు. మొత్తం 25 అంశాలను అజెండాలో పొందుపరిచి చర్చించేందుకు ప్రవేశపెట్టారు. అయితే వాటిలో పలు అంశాలు ఎన్నికల కోడ్ రాక ముందు నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలోని అజెండాలోని అంశాలే కావడంతో చర్చ జరగాలని పలువురు పట్టుబట్టారు. దీంతో ఒక అంశం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నారంపేట వద్ద నిర్మిస్తున్న ఇండస్ట్రియల్ పార్కుకు సోమశిల కెనాల్ నుంచి ఒక ఎంఎల్‌డీ నీటిని ప్రత్యేక పైపులైన్ ద్వారా సరఫరా చేసే అంశాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. అదే క్రమంలో మిగిలిన 24 అంశాలను వాయిదా వేస్తూ కౌన్సిల్ సమావేశాన్ని ముగిస్తున్నట్లు తెలిపారు. వీటిలో పలు అంశాలు మున్సిపల్ పరిధిలోని కాంప్లెక్స్‌లలో అద్దె దుకాణాల లీజు పెంపు, కొన్ని దుకాణాల నెలవారీ అద్దె తగ్గింపు కోరుతూ దాఖలు చేసుకున్న వాటిపై విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉండడంతో వాటిని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, కౌన్సిలర్లు డాక్టర్ కౌసల్యమ్మ, స్వరూపరాణి, తిరుపతమ్మ, పెంచలయ్య, నౌషాద్ బేగం, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ



పడమటికంభంపాడులో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని పడమటికంభంపాడు గ్రామంలో శనివారం ఉపాధి హామీ పనులకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ముందుగా డీఆర్పీలు గ్రామానికి మంజూరైన నగదు వివరాలను చదివి వినిపించారు. అనంతరం గ్రామంలో జరిగిన పనుల గురించి సమీక్షించారు. గ్రామం నుంచి దరంపల్లెమ్మ ఆలయం వరకు రోడ్డు పనులు అసలు జరగలేదని, నిత్యం పనులకు హాజరయ్యే వారికి నగదు జమ కావని, ఇళ్ల వద్ద ఉండి పనులకు రాకుండా ఉండే వారికి మస్టర్లు వేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతదేవరాయల్లి గ్రామంలో కూడా సభ నిర్వహించి ప్రజల సమక్షంలో ఉపాధి పనులపై విచారణ జరిపారు. కార్యక్రమంలో ఏపీఓ దయాసాగర్, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు కత్తి లావణ్య, షేక్ రమీజాబేగం, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మేనేజర్‌కు సన్మానం



మున్సిపల్ మేనేజర్‌ను సన్మానిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ మేనేజర్‌గా మూడేళ్లపాటు విధులు నిర్వహించి ముందస్తుగా రిటైర్‌మెంట్ తీసుకుంటున్న మోహనకుమారిని మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్, మహిళా కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. శనివారం ఆత్మకూరులోని మున్సిపల్ ఎంజీఆర్ సమావేశ మందిరంలో మేనేజర్ మోహనకుమారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఆమె అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, కమిషనర్ షేక్.ఫజులుల్లా, వైస్ చైర్మన్లు శ్రావణ్‌కుమార్, సర్దార్, కౌన్సిలర్లు రాధికారెడ్డి, తిరుపతమ్మ, స్వరూపరాణి, గుడి సంధ్య, డాక్టర్ కౌసల్యమ్మ, నౌషాద్‌బేగం, విజయజ్యోతి, పెంచలయ్య, శివకోటారెడ్డి, కామాక్షయ్యనాయుడు, ఖాదర్‌బాషా, జి.వేణు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



పాల్గొన్న పాఠశాలల వ్యాన్ డ్రైవర్లు



భద్రతా మాసోత్సవాల గురించి వివరిస్తున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు: పాఠశాలల వాహనాల డ్రైవర్లు డ్రైవింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంవీఐ ఎం.రాములు సూచించారు. జాతీయ భద్రతా మాసోత్సవాలు శనివారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ప్రగతి ఇంగ్లిషు మీడియం పాఠశాలలో నిర్వహించారు. 30 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన వ్యాన్ డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడడం, మద్యం తాగి వాహనాలు నడపడం నిషేధమని తెలిపారు. వాహనాలు మరమ్మతులకు గురైతే వెంటనే పాఠశాలల యాజమాన్యానికి తెలియజేసి మరమ్మతులు పూర్తి చేసుకొని వాహనాలను నడపాలన్నారు. ప్రతి నెలా వాహనాలను చెక్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్‌లు ఎస్.రామ్మోహన్‌రెడ్డి, కోటిరెడ్డి, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి సన్మానం



సోమశిల: ఉద్యోగ విరమణ చేస్తున్న వారిని సన్మానిస్తున్న దృశ్యం



ఉదయగిరి: బీసీకాలనీ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో..

సోమశిల: అనంతసాగరం మండలంలోని సోమశిల గ్రామంలో ప్రాజెక్టు డివిజన్–1 జూనియర్ అసిస్టెంట్ మల్లెంకొండయ్య, సబ్ డివిజన్–3 క్లీనర్ పొంగూరు శ్రీనివాసులు, ప్రాజెక్ట్ గేట్ హెల్పర్ శ్రీనివాసరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా శనివారం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ ఈఈ బొమ్మిరెడ్డి దశరథరామిరెడ్డి, డిప్యూటీ ఈఈ రవీంద్రప్రసాద్, ఆత్మకూరు నియోజకవర్గ ఏపీ ఎన్‌జీఓ బల్లి చంద్రశేఖర్, వర్క్‌చార్జ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పలపాటి రామయ్య, అసిస్టెంట్ ఈఈ రామ్మోహన్‌రెడ్డి, పెద్దిరాజు, హరిప్రసాద్, నిఖిల్, ప్రాజెక్ట్ సిబ్బంది ఉత్తయ్య, ఉప్పలపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

ఉదయగిరి: స్థానిక బీసీకాలనీ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షేక్ జమీర్ ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా శనివారం ఆయనను ఎంఈఓ మస్తాన్‌వలి, సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఆత్మకూరు: విద్యార్థులకు పదో తరగతి ఉత్తీర్ణత కీలకమైన దశ అని డిప్యూటీ ఈఓ గోపాల్ అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన అన్ని పాఠశాలల విద్యార్థులకు శనివారం ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు, షీల్డులు అందజేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం డిప్యూటీ ఈఓ గోపాల్‌ను, ఎంఈఓ నజీర్‌బాషాను, పలు పాఠశాలల హెచ్‌ఎంలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతలక్ష్మి, కోటేశ్వరి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కామేశ్వరి, యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు శివకుమార్, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మెరుగైన ఉపాధి



ఆత్మకూరు: తమ సంస్థ ద్వారా పేద మహిళలకు మెరుగైన ఉపాధి కల్పించేలా ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయడంతోపాటు కొందరికి కుట్టు మెషీన్లు పంపిణీ చేసినట్లు చేజర్ల పుల్లయ్యాచారి చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ డి.నాగరత్నమ్మ తెలిపారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 12 మంది మహిళలకు ఆత్మకూరు పట్టణంలోని ప్రియదర్శినినగర్‌లో ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో శనివారం స్థానిక కౌన్సిలర్ నోటి విజయ్‌జ్యోతి చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. నాగరత్నమ్మ మాట్లాడుతూ ఇప్పటికే 11 బ్యాచ్‌లకు కుట్టు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న ఉచిత కుట్టు శిక్షణకు ఆసక్తి గల వారు పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 99631 18681 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.చెంచురత్నం, సుబ్బరత్నమ్మ, వెంకటకృష్ణయ్య, వెంకటపూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణానికి చెందిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5 కుటుంబాలకు రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఎవరైనా మృతిచెందితే ఆ కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తున్నారు. అందులో భాగంగా 12వ వార్డులో పేమల సుబ్బారావు, 13వ వార్డులో గొట్ల హరీష్, 15వ వార్డులో షేక్ ముంతాజ్‌బేగం, 18వ వార్డులో గుర్నాథం బుజ్జమ్మ, 22వ వార్డులో సోమా పెంచలనరసింహులు ఇటీవల మృతిచెందగా ఆయా కుటుంబాలకు సంస్థ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కేవీ శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, పెంచల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటవీ స్థలం పరిశీలన



అటవీ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీతారామపురం : సీతారామపురం – పోరుమామిళ్ల ఘాట్ రోడ్డు మార్గంలోని అటవీ ప్రాంతంలో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఓ మొబైల్ నెట్‌వర్క్ కేబుల్ ఏర్పాటు కోసం శనివారం ఉదయగిరి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం ఘాట్ రోడ్డు మార్గంలో 167/బీ జాతీయ రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో గతంలో చేసిన సర్వే అంతా తారుమారు అయిందని తెలిపారు. అటవీ ప్రాంతంలో మళ్లీ సర్వే చేసేందుకు పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట డీఆర్‌ఓ ప్రసాద్, ఎఫ్‌బీఓ ఖాజా, మొబైల్ నెట్‌వర్క్ సంస్థ సిబ్బంది ఉన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆత్మకూరు మండలంలోని 11 సచివాలయాల పరిధిలో జూలై 1న ఇంటి వద్దకే సామాజిక పింఛన్లు అందించేందుకు ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ బాలాజీనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు ఎవరూ సచివాలయాలు, బ్యాంకుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కోసం సచివాలయ సిబ్బందిని కేటాయించామని, వారు ఉదయం 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు.

ఆత్మకూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్ లబ్ధిదారులకు సోమవారం వారి ఇళ్ల వద్దనే పింఛన్లు అందజేయనున్నట్లు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 8 సచివాలయాల సిబ్బంది సోమవారం ఉదయం నుంచే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

సోమశిల జలాశయంలో చేపల వేట నిషేధం

సోమశిల: సోమశిల జలాశయంలో జూలై, ఆగస్టు నెలల్లో చేపల వేట నిషేధమని మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్రీనివాసరావు శనివారం తెలిపారు. తల్లి చేప గుడ్లు పెట్టే దశలో ఉండడం వల్ల చేప పిల్లలు ఎక్కువగా ఉత్పత్తి అయి మత్స్యసంపద పెరిగేందుకు అవకాశం కలుగుతుందని, తద్వారా జలాశయంలో వేట చేసే మత్స్యకారులకు జీవనోపాధి లభిస్తుందని తెలిపారు. అక్రమంగా చేపల వేట చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ రెండు నెలలు జాలర్లు, వ్యాపారులు వేట చేయకుండా సహకరించాలని తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి

సీతారామపురం : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అందించే మూడు సిలిండర్ల ఉచిత పథకానికి వినియోగదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు శనివారం తెలిపారు. గృహ అవసరాలకు వాడే 14.2 కేజీల సిలిండర్ వినియోగదారులు సేఫ్టీ చెక్, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. వినియోగదారులు భద్రత దృష్ట్యా 5 సంవత్సరాలకు ఒకసారి సురక్ష ట్యూబ్‌ను మార్చుకోవాలని సూచించారు.

విద్యా ప్రవేశంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌వలి

ఉదయగిరి: మండలంలోని ప్రధానోపాధ్యాయులు విద్యా ప్రవేశం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏంఈఓలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యా ప్రవేశం కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. మొదటి దశ ఈ నెల 30వ తేదీ వరకు, రెండో దశ జూలై 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మస్తానయ్య సేవలు మరువలేనివి



ఆత్మకూరు: కామ్రేడ్ కొండమూరి పెద మస్తానయ్య సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఆత్మకూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం పెద్ద మస్తానయ్య సంస్మరణ సభ నిర్వహించారు. నెల్లూరు ప్రజా వైద్యశాల డాక్టర్ ఎంవీ రమణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పేదల అభ్యున్నతి కోసం కొండమూ రి పెద్ద మస్తానయ్య సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు, జి.లక్ష్మీపతి, షేక్ సందాని, ఎ.నాగయ్య, ఎం.నాగేంద్ర, గద్దర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.